క్లుప్తంగా

బిల్లులు చెల్లించాలని వినతి


వినతిపత్రం అందిస్తున్న కాంట్రాక్టర్లు

మందమర్రిరూరల్: మందమర్రి మున్సిపాలిటీ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు చెల్లించాలని బుధవారం మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాజలింగుకు కాంట్రాక్టర్లు వినతిపత్రం అందించారు. అప్పులు తీసుకొచ్చి అభివృద్ధి పనులు చేశామని, బిల్లులు సకాలంలో రాకపోవడంతో వడ్డీ చెల్లించలేని దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రావికంటి వెంకటేశం, కొంగల తిరుపతిరెడ్డి, బోరిగం వెంకటేశం, ఏల్పుల కిరణ్ ఉన్నారు.

పారిశుద్ధ్య పనులు తప్పక చేపట్టాలి


మాట్లాడుతున్న డీపీవో వెంకటేశ్వర్‌రావు

చెన్నూర్‌రూరల్: గ్రామపంచాయతీల్లో ప్రతీరోజు తప్పనిసరిగా పారిశుద్ధ్య పనులు చేపట్టాలని డీపీవో వెంకటేశ్వర్‌రావు అన్నారు. చెన్నూర్ మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేశారు. పారిశుద్ధ్య పనులు, నర్సరీల నిర్వహణ, క్లోరినేషన్, ఇంటిపన్నుల వసూలు ముమ్మరంగా చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మోహన్, ఎంపీవో అజ్మల్‌అలీ, కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

చెన్నూర్‌లో తిరంగా ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

చెన్నూర్: ఆపరేషన్ సిందూర్ విజయవంతం కోసం కృషి చేసిన సైనికులకు వందనమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ అన్నారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతంపై బీజేపీ ఆధ్వర్యంలో స్థానిక ప్రతాప్ మారుతి హనుమాన్ మందిర్ నుంచి పట్టణ ప్రధాన వీధుల్లో తిరంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు తుమ్మ శ్రీపాల్, జిల్లా కార్యదర్శి దుర్గం అశోక్, జాడి తిరుపతి, గర్రెపల్లి వెంకటనర్సయ్య, మైనార్టీ నాయకులు సఫ్దర్, నడిపల్లి లక్ష్మణ్‌రావు, బీజేపీ, విశ్వహిందూ పరిషత్ నాయకులు పాల్గొన్నారు.

క్వార్టర్ల కేటాయింపు కోసం కౌన్సెలింగ్


కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

మందమర్రిరూరల్: ఉద్యోగులకు క్వార్టర్ల కేటాయింపు కోసం ఏరియాలోని సీఈఆర్ క్లబ్ ఆవరణలో బుధవారం అధికారులు కౌన్సెలింగ్ నిర్వహించారు. మందమర్రి, శ్రీరాంపూర్ ఏరియాల్లో కార్మికుల కోసం 97క్వార్టర్ల కేటాయింపు కోసం ప్రకటించగా 77మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. సీనియారిటీ పద్ధతిన 21మంది ఉద్యోగులకు క్వార్టర్లు కేటాయించినట్లు ఏరియా పర్సనల్ మేనేజర్ సల్ల శ్యామ్‌సుందర్ తెలిపారు. ఇన్‌చార్జి ఎస్వోటు జీఎం రవీందర్, ఐఈడీ రాజన్న, డీవైపీఎం మైత్రేయబంధు ఉన్నారు.

యోగాతో మానసికోల్లాసం


మొక్క నాటుతున్న డాక్టర్ పద్మజ, తదితరులు

నస్పూర్: యోగాతో శారీరక మానసిక దృఢత్వం, మానసికోల్లాసం కలుగుతుందని ప్రభుత్వ ఆయుర్వేదిక్ ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్, జిల్లా ఇన్‌చార్జి డాక్టర్ పద్మజ తెలిపారు. అంతర్జాతీయ యోగా దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం విలేజ్ నస్పూర్‌లోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో ×ఒక భూమి–ఒక ఆరోగ్యం÷ కోసం అనే నినాదంతో హరిత యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో సిబ్బంది మొక్కలను నాటారు. కార్యక్రమంలో యోగా ఇన్‌స్ట్రక్టర్ సుధాకర్, పాఠశాల హెచ్ ఎం దామోదర్, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

నోటీసుల అలజడి

- తప్పుడు ధ్రువపత్రాలతో ప్లాట్లు విక్రయించిన రియల్టర్లు
- వినూత్న కాలనీలో 12ఇళ్లకు రెవెన్యూశాఖ నోటీసులు
- అనుమతులతోనే కట్టుకున్నామని బాధితుల ఆవేదన


సర్వే నంబర్ 36లో చేపట్టిన నిర్మాణాలు

నస్పూర్: పట్టణ పరిధిలోని ఓ ప్రభుత్వ భూమిలో అక్రమంగా ఇళ్లు నిర్మించుకున్నారని ఆ ఇళ్ల యజమానులకు రెవెన్యూ అధికారులు నోటీసులు పంపించడం అలజడి సృష్టించింది. వినూత్న కాలనీలోని ప్రభుత్వ భూమిలో 12ఇళ్లు సర్వే నంబర్ 36లో అక్రమంగా నిర్మించుకున్నారని, ధ్రువీకరణ పత్రాలతో రెవెన్యూ కార్యాలయంలో సంప్రదించాలని రెవెన్యూ అధికారులు 12మంది ఇళ్ల యజమానులకు నోటీసులు జారీ చేశారు. దీంతో కంగుతిన్న పలువురు బాధితులు విచారణ కోసం తమ వద్ద ఉన్న ధ్రువీకరణ పత్రాలను రెవెన్యూ కార్యాలయంలో సమర్పించారు.

ప్రభుత్వ భూమిని ప్లాట్లుగా మార్చి...

నస్పూర్ శివారులోని సర్వే నంబర్ 36లో 5.16 గుంటల ప్రభుత్వ భూమి ఉంది. దాని చుట్టూ సర్వే నంబర్లు 35, 37, 39లలో ప్రైవేటు పట్టా భూములు ఉన్నాయి. ఇదే అదనుగా భావించిన రియల్టర్లు ప్రైవేటు పట్టా సర్వే నంబర్లతో పాటు 36సర్వే నంబర్‌లోని ప్రభుత్వ భూమిలో సైతం ప్లాట్లు ఏర్పాటు చేసి ప్రైవేటు సర్వే నంబర్లు వేసి, విక్రయించి రిజిస్ట్రేషన్ చేశారు.

రూ.6కోట్ల భూమి అన్యాక్రాంతం...

సర్వే నంబర్ 36లోని 5.16గుంటల ప్రభుత్వ భూమిలో రియల్టర్లు ప్లాట్లుగా మార్చి అమ్మిన భూమి విలువ సుమారు రూ.6కోట్లుగా ఉంటుంది. దీనిలో దాదాపు అన్ని ప్లాట్లు అమ్ముడు పోగా, అందులో 12ప్లాట్ల యజమానులు ఇళ్లు నిర్మించుకొని నివాసం ఉంటున్నారు. మిగితా ప్లాట్లను సైతం పలువురు తమ భవిష్యత్ అవసరాల దృష్ట్యా కొనుగోలు చేశారు. ఇళ్ల నిర్మాణాలకు మున్సిపల్ అధికారులు ఎలాంటి అభ్యంతరాలు తెలుపకుండా అనుమతులు ఇచ్చి, ఇంటి నంబర్లను కూడా కేటాయించారు. అప్పుడు ఎలాంటి అభ్యంతరం తెలుపని అధికారులు, ఇప్పుడు ప్రభుత్వ భూమి అంటూ నోటీసులు జారీ చేయడం ఏమిటని పలువురు బాధితులు ప్రశ్నిస్తున్నారు.

నోటీసులతోనే సరి...

పట్టణ పరిధిలోని సర్వే నంబర్ 42, 119, 64తో సహా పలు ప్రభుత్వ భూముల్లో అక్రమంగా నిర్మాణాలు చేపట్టారంటూ, గతంలో పలువురికి నోటీసులు పంపారు. తరువాత వారి నుంచి అందిన కాడికి దోచుకొని, ప్రభుత్వ పరమైన చర్యలు తీసుకోకుండా విస్మరించడం పరిపాటిగా మారిందని పలువురు ఆరోపిస్తున్నారు. సర్వే నంబర్ 36లోని మిగులు భూమిని అధికారులు స్వాధీనం చేసుకుంటారా లేదా అనేది వేచి చూడాలి.

విచారణ చేపట్టాం

పట్టణ పరిధిలోని సర్వే నంబర్ 36ప్రభుత్వ భూమిలో అక్రమంగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టినట్లు మా దృష్టికి వచ్చింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 12ఇళ్ల యజమానులకు నోటీసులు అందజేశాం. పలువురు తమ వద్ద ఉన్న ధృవీకరణ పత్రాలను సమర్పించారు. వాటిని పరిశీలించి, విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తాం.

– శ్రీనివాస్, తహసీల్దార్, నస్పూర్

ముందుకు సాగని పనులు..!

- అర్ధంతరంగా నిలిచిన చెన్నూర్ బస్సు డిపో
- ప్రారంభించి రెండేళ్లు అయినా పూర్తికాని వైనం


చెన్నూర్‌లో నిలిచిన ఆర్టీసీ బస్సు డిపో పనులు

చెన్నూర్: చెన్నూర్‌లో ఆర్టీసీ బస్సు డిపో నిర్మాణం కోసం ప్రజలు సుమారు ఐదేళ్లు పోరాటం చేశారు. 2023లో కోరిక నెరవేరే సమయం వచ్చింది. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించాలని, గత ప్రభుత్వ హయాంలో బస్సు డిపో నిర్మాణ పనులను ప్రారంభించారు. పనులు ప్రారంభించి రెండేళ్లవుతున్నా, ముందుకు సాగడంలేదు. దీంతో చెన్నూర్ ప్రాంత ప్రజల ఆశలపై నీళ్లు చల్లినట్టైంది.

ఇది పరిస్థితి...

బస్సు డిపో నిర్మాణానికి గెర్రెకాలనీలోని 869 సర్వే నంబర్‌లో గల ప్రభుత్వ భూమిని 3.01ఎకరాల స్థలాన్ని కేటాయించారు. డిపో నిర్మాణానికి డీఎంఎఫ్‌టీ నుంచి రూ.4కోట్ల నిధులు మంజూరయ్యాయి. 30జూలై 2023లో బస్సు డిపో నిర్మాణానికి అప్పటి ఎమ్మెల్యే బాల్క సుమన్ శంకుస్థాపన చేశారు. ప్రహరీ నిర్మాణం పూర్తయ్యింది. పనులు చురుకుగా సాగుతున్న నేపథ్యంలో ఆ భూమి తమదేనంటూ కొందరు వ్యక్తులు కోర్టును ఆశ్రయించారు. పనులు నిలిపివేయాలని కోర్టు స్టే విధించగా, అర్ధంతరంగా నిలిచిపోయాయి. ఆ వ్యక్తులు కోర్టును ఆశ్రయించిన వెంటనే కౌంటర్ దాఖలు చేయాల్సి ఉండగా, అధికారుల నిర్లక్ష్యం కారణంగా పనులు నిలిచిపోయాయని ప్రజలు ఆరోపిస్తున్నారు.

బస్సు డిపోతో మరింత ఆదాయం..

మంచిర్యాల ఆర్టీసీ డిపోకు అత్యధికంగా ఆదాయం వచ్చే రూటు చెన్నూర్ కావడం విశేషం. మంచిర్యాల నుంచి చెన్నూర్‌తో పాటు చెన్నూర్ నుంచి హైదరాబాద్, ఆదిలాబాద్, కోటపల్లి, వేమనపల్లి, సిరొంచ, కాళేశ్వరం, సోమన్‌పల్లి ప్రాంతాలకు నిత్యం 50కి పైగా ఆర్టీసీ బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి. చెన్నూర్‌లో ఆర్టీసీ డిపో నిర్మిస్తే చెన్నూర్ మండలంతో కోటపల్లి, వేమనపల్లి, పక్కనే ఉన్న మహారాష్ట్రలోని సిరొంచ, గడిచిరోలి, కాళేశ్వరం, కాటారం, గోదావరిఖని, వరంగల్, ఆసిఫాబాద్, వేములవాడ, బెల్లంపల్లి, మందమర్రి పట్టణాలకు ఆర్టీసీ బస్సులు రాకపోకలు సాగించే అవకాశం ఉంటుంది. ఆర్టీసీ సర్వీసుల రవాణా పెరిగితే డిపోకు మరింత ఆదాయం పెరిగే అవకాశం ఉంది. ఇప్పటికైనా అధికారులు పనులను పునః ప్రారంభం అయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కౌంటర్ దాఖలు చేశాం..



చెన్నూర్‌లోని గెర్రెకాలనీలో ఆర్టీసీ డిపోకు కేటాయించిన ప్రభుత్వ భూమిని కొందరు వ్యక్తులు తమదని కోర్టును ఆశ్రయించారు. 869భూవిలోని 3.1ఎకరం భూమి పక్క ప్రభుత్వ భూమి కావడంతో కోర్టులో కౌంటర్ దాఖలు చేశాం. కోర్టు స్టే ఎత్తి వేస్తే పనులు ప్రారంభమవుతాయి.

– మల్లికార్జున్, తహసీల్దార్, చెన్నూర్

చామనపల్లిలో భూములు పరిశీలన


రైతులతో కలిసి మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర నాయకులు ఏమాజీ

వేమనపల్లి: పేద రైతుల భూములపై కన్నేసి, అక్రమ కేసులు నమోదు చేసి వేధిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొయ్యల ఏమాజీ అన్నారు. మండలంలోని చామనపల్లి గ్రామానికి వెళ్లి రైతులతో కలిసి భూములను పరిశీలించారు. సుమారు 50సంవత్సరాల నుంచి రైతులు 65, 67 సర్వే నంబర్లలో భూములను సాగు చేసుకుంటున్నారని, ఆ భూముల్లో బోర్లు వేసి విద్యుత్ లైన్ అమర్చుకొని సాగు చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం పట్టా పాస్ పుస్తకాలు ఇచ్చిందని, రైతులు రుణాలు తీసుకుంటూ రుణమాఫీ పొందుతున్నారని 1997లోనే సైతం పట్టా ఇచ్చిందన్నారు. అలాంటి భూములను సాగు చేసుకుంటున్న రైతులపై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపిస్తున్నారని, ఈ విషయమై కలెక్టర్ స్పందించి అటవీ సిబ్బందిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని ఆదేశించినా పోలీసు అధికారులు అటవీ అధికారులను కాపాడే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా తీరు మార్చుకోవాలన్నారు. ఆయన వెంట బీజేపీ నాయకులు కేశవరెడ్డి, రైతులు దుర్గం బానయ్య, మొండయ్య, పర్వతాలు, లక్ష్మణ్, విజయ్‌లు ఉన్నారు.

'రైతులను నిండా ముంచిన ప్రభుత్వం'


రైతులతో మాట్లాడుతున్న దుర్గం చిన్నయ్య

నెన్నెల: ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లనే రైతులు నిండా మునిగారని మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఆరోపించారు. అకాల వర్షాలతో ధాన్యం తడిసి రైతులు తీవ్రంగా నష్టపోవడానికి ప్రభుత్వమే కారణమన్నారు. మండలంలోని మైలారం, గొల్లపల్లి గ్రామాల్లో దుర్గం చిన్నయ్య బుధవారం పర్యటించారు. వర్షానికి తడిసిన ధాన్యం కుప్పలను పరిశీలించారు. ఎప్పటికప్పుడు ధాన్యం సేకరించి మిల్లులకు తరలిస్తే వర్షాలతో రైతులకు నష్టం జరిగేది కాదన్నారు. వర్షాలతో రైతులు ఇక్కట్లు పడుతుంటే ఎమ్మెల్యే వినోద్ వారిని పట్టించుకోవడం లేదన్నారు. గ్రామాల్లో పర్యటించాల్సిన వినోద్ మంత్రి పదవీ కోసం ఢిల్లీ అగ్రనేతల చుట్టూ తిరుగుతున్నారని ఆరోపించారు. తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సాగర్‌గౌడ్, నాయకులు ఇబ్రహీం, ఇందూరి రమేశ్, మేకల మల్లేశ్, శ్రీనివాస్‌గౌడ్, ప్రేంసాగర్‌గౌడ్, తిరుపతిగౌడ్ ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి


వినతిపత్రం అందిస్తున్న నాయకులు

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలో నెలకొన్న పలు ప్రధాన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి వొడ్నాల శ్రీనివాస్, పలువురు నాయకులు బుధవారం చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామిని హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం అందించారు. సుమారు 50వేల జనాభా కలిగిన మున్సిపాలిటీలో 50పడకల ఆసుపత్రి ఏర్పాటు చేయాలని, వీధి విక్రేతలకు సరైన స్థలం కేటాయించాలని, అబ్రహంనగర్‌లో 11కేవీ విద్యుత్ లైన్‌ను నివాస స్థలం నుంచి మార్చాలని కోరారు. మంచిర్యాల నుంచి మందమర్రికి ఆర్టీసీ బస్సును రామకృష్ణాపూర్ మీదుగా నడిపించాలని, సింగరేణి ఏరియా ఆసుపత్రిలో ప్రైవేటు వారికి పేమెంట్ పద్ధతిలో చికిత్స అందించేలా చూడాలని ఎమ్మెల్యేను కోరారు.

సైబర్ నేరాలపై అవగాహన


ఆరెపల్లిలో అవగాహన కల్పిస్తున్న కళాకారులు

భీమారం: స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా భీమారం బ్రాంచి ఆధ్వర్యంలో బుధవారం ఆరెపల్లి, బూర్గుపల్లి, భీమారం గ్రామాల్లో సైబర్ నేరాలపై కళాజాత బృందం ఆటపాటలతో అవగాహన కల్పించారు. సాంకేతిక ప్రగతికి అనుగుణంగా సైబర్ నేరాలు రోజురోజుకి విపరీతంగా పెరిగిపోతున్నాయని బ్యాంక్ మేనేజర్ సుబ్బారెడ్డి తెలిపారు. అధికలాభాల పేరుతో ఫేక్ లింక్‌లు పంపుతూ, ఖాతాలను ఖాళీ చేస్తున్నారన్నారు. బ్యాంకుఖాతా, డెబిట్ కార్డు వివరాలను ఎవరికీ తెలుపొద్దని ప్రజలను కోరారు. కళాకారుల ప్రదర్శన ప్రజలను ఎంతో ఆకట్టుకుంది.

పోడు రైతులకు రుణాలివ్వాలి


ర్యాలీగా వెళ్తున్న ఆదివాసీ నాయకులు

వేమనపల్లి: పోడు వ్యవసాయంపై ఆధారపడి బతుకుతున్న ఆదివాసీలకు బ్యాంకు రుణాలు అందజేయాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాగాల రాజన్న, ఎర్మ పున్నం అన్నారు. మండల కేంద్రంలో ఆదివాసీలతో కలిసి బుధవారం ర్యాలీ నిర్వహించారు. అధికారులు తమ వైఖరి మార్చుకొని పోడు రైతులకు రుణాలివ్వాలని, లేకపోతే కలెక్టరేట్‌ను ముట్టడిస్తామన్నారు. కార్యక్రమంలో టీఏజీఎస్ జిల్లా ఉపాధ్యక్షురాలు మల్లేశ్వరి, జిల్లా నాయకులు ముత్తయ్య, మండల అధ్యక్షుడు మధునయ్య, మొండి, కిరణ్, కొడిపె నారాయణ, తలండి గంగారాం, పార్వతి, నాయిని పోశం, జంబి మల్లయ్య పాల్గొన్నారు.

30న కలెక్టరేట్ ఎదుట ధర్నా


ఉపాధిహామీ కూలీలతో మాట్లాడుతున్న నాయకులు

కోటపల్లి: ఈ నెల 30న ఉపాధిహామీ సమస్యలు పరిష్కరించాలని కలెక్టరేట్ ఎదుట చేపట్టే ధర్నాకు కూలీలు పెద్ద ఎత్తున తరలిరావాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు బోడంకి చందు పిలుపునిచ్చారు. మండలంలోని వెలమపల్లి, లక్ష్మీపూర్, అర్జునగుట్ట గ్రామాల్లోని ఉపాధిహామీ కూలీలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకొని మాట్లాడారు. ఎనిమిది వారాలైనా ఉపాధి హామీ కూలీలకు డబ్బులు రావడంలేదని, అనేక పోరాటాల వల్ల వచ్చిన గ్రామీణ ఉపాధిహామీ పనిని కేంద్రం నిర్వీర్యం చేస్తుందన్నారు. పాత బకాయిలను వెంటనే విడుదల చేయాలని, లేకపోతే కూలీలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు సమకూర్చడంలేదని, ప్రతీవారం చేసిన పనికి స్లిప్పులు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. సిబ్బందికి పదోన్నతులు, బదిలీలు చేపట్టి కొత్త జాబుకార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రవి, ఉపాధిహామీ కూలీలు పాల్గొన్నారు.

రైతులు రశీదులు తీసుకోవాలి


తనిఖీ చేస్తున్న సీఐ, వ్యవసాయశాఖ అధికారులు

చెన్నూర్: రైతులు కొనుగోలు చేసిన ఎరువులు, విత్తనాలకు సంబంధించిన రశీదు తీసుకోవాలని సీఐ దేవేందర్‌రావు అన్నారు. స్థానిక చేతన్ ట్రేడర్స్, రాజారాం గిల్డా ఎరువుల, విత్తనాల షాపుల్లో బుధవారం పోలీసులు, వ్యవసాయశాఖ అధికారులు సంయుక్తంగా తనిఖీ చేశారు. రిజిస్టర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. అనుమతి లేని విత్తనాలు, ఎరువులను రైతులకు విక్రయించవద్దన్నారు. నకిలీ విత్తనాలు, ఎరువులను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. త్వరలోనే ఫర్టిలైజర్, ఫెస్టిసైడ్ షాపుల యజమానులతో సమావేశం ఏర్పాటు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఏవో కల్పన, సిబ్బంది పాల్గొన్నారు.

నాలుగు నూతన ట్రాన్స్‌ఫార్మర్లు ప్రారంభం


ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభిస్తున్న స్థానిక నాయకులు

మంచిర్యాలటౌన్: పట్టణంలో లోఓల్టేజి సమస్యను పరిష్కరించేందుకు స్థానిక ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు ఆదేశాలతో నాలుగు నూతన ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయగా, బుధవారం వాటిని ప్రారంభించారు. పట్టణంలోని కచ్చిరు చౌరస్తాలో 160కేవీఏ డీటీఆర్, మేరవాడలో 160కేవీఏ డీటీఆర్, మధురానగర్ 1లో 100కేవీఏ డీటీఆర్, పాతమంచిర్యాల రోడ్డు వద్ద 100 కేవీఏ డీటీఆర్‌లను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు తూముల నరేశ్, సింగిల్ విండో డైరెక్టర్ తూముల వెంకటేశ్, మాజీ కౌన్సిలర్ బొలిశెట్టి కిషన్, మాజీ కౌన్సిలర్ చింతకింది మల్లయ్య, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పెంట రజిత, బొల్లం భీమయ్య, పురెల్ల రాజు పాల్గొన్నారు.

టీబీజీకేఎస్ కమిటీ ఎన్నిక


ఎన్నికైన ఫిట్ కమిటీ సభ్యులు

శ్రీరాంపూర్: గనిపై బుధవారం టీబీజీకేఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించగా ఆ యూనియన్ కేంద్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందరెడ్డి, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి బండి రమేశ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ నూతన ఫిట్ కమిటీని ఎన్నుకున్నారు. సెక్రెటరీగా గడ్డం సుధాకర్, అసిస్టెంట్ ఫిట్ సెక్రెటరీగా జంగం రమేశ్, జనరల్ షిఫ్ట్ సెక్రెటరీగా రామగిరి సంపత్, రిలే సెక్రెటరీలుగా పెట్టం సారయ్య, అంతల వెంకన్న, కుడుకా సత్యనారాయణ, మహిళా విభాగం సెక్రెటరీలుగా ముద్దసాని ప్రవంతి, హేమలత, ఎంవీ డ్రైవర్స్ ఇన్‌చార్జీగా శ్యాంకుమార్, బ్లాస్టింగ్ ఇన్‌చార్జీగా మేకల రవి, ఇప్ప వెంకటేశ్, జలందర్‌లను ఎన్నుకున్నారు. వీరితో పాటు 53మంది కార్యవర్గ సభ్యులను నియమించారు. కార్యక్రమంలో పానుగంటి సత్తయ్య, పోతు ఆంజనేయులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

- **ఈ కేవైసీ చేసుకోవాలి**

మందమర్రిరూరల్: సింగరేణిలో ఉద్యోగం చేస్తున్న గ్యాస్ వినియోగదారులు ఈ కేవైసీ చేసుకోవాలని సింగరేణి సూపర్‌బజార్ డివిజనల్ మేనేజర్ పాలకుర్తి రాజు తెలిపారు. స్థానిక మార్కెట్ ఏరియాలో బుధవారం గ్యాస్ వినియోగదారులకు ఈ కేవైసీపై అవగాహన కల్పించారు. సూపర్‌బజార్ బ్రాంచ్ మేనేజర్ సుదర్శన్, ఎల్‌పీజీ కోఆర్డినేటర్ రాజు, గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ (ఇన్‌చార్జి) మాదవరావు, ప్రసాద్, ఉద్యోగులు ఉన్నారు.

- **గ్రామాల్లో భూ భారతి గ్రామసభలు**

కోటపల్లి: ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూ భారతి గ్రామసభలను మండలంలోని 37రెవెన్యూ గ్రామాల్లో వచ్చే నెల 3నుంచి 20వరకు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ రాఘవేంద్రరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. భూ సమస్యలున్న వారు దరఖాస్తులు సమర్పించాలని కోరారు.

- **ఎన్టీఆర్ జయంతి**

జన్నారం/పాతమంచిర్యాల: ఎన్టీ రామారావు జయంతిని జిల్లా కేంద్రంలోని లక్ష్మిటాకీస్ చౌరస్తాలో, జన్నారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కమ్మసేవా సమితి జిల్లా గౌరవ అధ్యక్షుడు డాక్టర్ విష్ణువర్ధన్‌రావు, అధ్యక్షుడు వడ్డే వినయ్‌కుమార్, టీడీపీ అడహక్ కమిటీ పార్లమెంటరీ కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

- **క్రీడలపై మక్కువ పెంచుకోవాలి**

తాండూర్: మానసిక, శారీరక ఉల్లాసం కోసం ప్రతి ఒక్కరూ క్రీడలపై మక్కువ పెంచుకోవాలని వక్తలు అన్నారు. మండలంలోని మాదారం పోలీసుస్టేషన్ గ్రౌండ్‌లో బుధవారం ఎన్‌ఎస్‌యూఐ మండల జనరల్ సెక్రెటరీ పుప్పాల కోహ్లీ పటేల్ ఆధ్వర్యంలో అండర్–18 విభాగంలో క్రీడా పోటీలను ఏర్పాటు చేశారు. పోటీలను ప్రారంభించి వక్తలు మాట్లాడారు. ఆరోగ్యకర జీవనానికి క్రీడలు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండీ ఈసా, మాజీ ఎంపీటీసీ సిరంగి శంకర్, యూత్‌కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు సన్నీబాబు తదితరులు పాల్గొన్నారు.

- **'ఎమ్మెల్యేను విమర్శిస్తే ఊరుకునేది లేదు'**

చెన్నూర్: అభివృద్ధి ప్రధాత ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామిని విమర్శిస్తే సహించేదిలేదని కోటపల్లి మాజీ జెడ్పీటీసీ పోటు రాంరెడ్డి అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్యేను విమర్శించే ముందు స్థాయిని గుర్తుంచుకోవాలన్నారు. ఎమ్మెల్యే పై అసత్య ఆరోపణలు చేయడం తగదన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గట్టు లక్ష్మణ్‌గౌడ్, కత్రల మల్లయ్య, రాగం స్వామి, సూరం మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- **6 నుంచి 'బడిబాట'**

భీమారం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించేందుకు చేపట్టే బడిబాట జూన్ 6 నుంచి ప్రారంభించనున్నట్లు ఎంఈవో వేణుగోపాల్ బుధవారం తెలిపారు. ఉపాధ్యాయులు 6న అన్ని గ్రామాల్లో గ్రామసభ నిర్వహించాలని కోరారు. 7న ఇంటింటికీ వెళ్లి బడీడు పిల్లలను గుర్తించాలన్నారు. 18వ తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు.

- **నూతన కార్యవర్గం**

మంచిర్యాలఅర్బన్: పట్టణంలోని బుక్‌స్టాల్ యూనియన్ నాయకులు బుధవారం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శివరాం, ఉపాధ్యక్షుడిగా రమేశ్ రెడ్డి, కోశాధికారిగా మనోజ్‌లను ఎన్నుకున్నారు. మంచిర్యాలలోని 15బుక్‌షాప్ యజమానులు కలిసి కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు.

- **సెలవులను పనిదినాలుగా చేయాలి**

మందమర్రిరూరల్: సింగరేణిలో ఈ ఆర్థిక సంవత్సరం(2025–26) సంస్థ నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించాలంటే సెలవు దినాలను పని దినాలుగా చేయాలని హెచ్‌ఎమ్మెస్ మందమర్రి ఏరియా వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఏరియాలోని హెచ్‌ఎమ్మెస్ ఆఫీస్‌లో బుధవారం మాట్లాడారు. దేశంలో బొగ్గు అవసరం ఎంతో ఉందని, హెచ్‌ఎమ్మెస్ అభిప్రాయాన్ని పరిగణలోకి తీసుకోవాలని సూచించారు. రాజిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రామస్వామి ఉన్నారు.

- **కూలిన ఇల్లు**

మందమర్రిరూరల్: మండలంలోని చిర్రకుంటలో ఇటీవల కురిసిన వర్షానికి తడిసి దుర్గం ప్రమీలకు చెందిన ఇల్లు బుధవారం రాత్రి కూలింది. ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఎంపీడీవో రాజేశ్వర్ కూలిన ఇంటి వద్దకు వెళ్లి పరిశీలించారు.